క్లుప్తంగా

మరోసారి జగనన్నే సీఎం కావాలి



మాట్లాడుతున్న కిషోర్

రాంబిల్లి: మరోసారి జగనన్నే సీఎం కావాలని, ఆయా దిశగా గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్ అన్నారు. మామిడివాడలో మంగళవారం 'ఎందుకు ఆంధ్రాకి జగనే కావాలి' కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ నెల 9న మామిడివాడలో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ధూళి నాగరాజు, సర్పంచ్ అప్పలనర్స, వైఎస్సార్‌సీపీ నాయకులు నానేపల్లి సాయివరప్రసాద్, నెట్టిం సత్యనారాయణ, ఎస్. సన్యాసిరావు పాల్గొన్నారు.

కృష్ణంపాలెంలో ఉపాధి పనులపై గ్రామసభ



పనులు వివరిస్తున్న సర్పంచ్ సత్తిబాబు

రాంబిల్లి: ఉపాధి పనులను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కృష్ణంపాలెం సర్పంచ్ పైల సత్తిబాబు అన్నారు. ఉపాధి హామీ పథకంపై వచ్చే ఆర్థిక సంవత్సరం చేపట్టే పనులపై నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ, ఈ పథకంతో వలసలకు పోకుండా గ్రామంలోనే ఉపాధి దక్కుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం విజిలెన్స్ డిప్యూటీ కమిషనర్ మల్లికార్జునరావు, ఏపీడీ శ్రీనివాసకుమార్, ఎంపీడీవో కె.ఎస్.కొండలరావు, ఈవోపీఆర్డీ రాజు, ఏపీవో శ్రీనువాస్ పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలి



దిమిలి లైబ్రేరియన్ శకుంతల

రాంబిల్లి: ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహించే గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని దిమిలి శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ ఎస్. శకుంతల కోరారు. ఈ మేరకు మంగళవారం ఆమె పలు పాఠశాలల ఉపాధ్యాయులను, గ్రామస్తులను కలిసి గ్రంథాలయ వారోత్సవ కార్యక్రమాలను వివరించారు. గ్రంథాలయాల ప్రాధాన్యాన్ని ఈ వారోత్సవాల్లో వివరించడంతో పాటు పలు రకాల ఆటలు, పాటలు ఇతర పోటీలను నిర్వహించి బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు.

శ్మశానవాటికలో జంగిల్ క్లియరెన్స్



తోటాడ శ్మశానవాటికలో జంగిల్ క్లియరెన్స్

మునగపాక : మండలంలోని తోటాడ శ్మశానవాటికలో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. సర్పంచ్ దొడ్డి మంగవేణి భర్త కోటేశ్వరరావు ప్రత్యేక చొరవతో శ్మశానవాటికలో పేరుకుపోతున్న తుప్పల తొలగింపుతో పాటు అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నారు. శ్మశానవాటికలో సదుపాయాలకు పంచాయతీ పాలకవర్గం చర్యలు తీసుకుంటుందని కోటేశ్వరరావు తెలిపారు.

పలు గ్రామాల్లో భారీ వర్షం



దిమిలిలో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో మంగళవారం భారీ వర్షం పడింది. మధ్యాహ్నం చినుకులతో ప్రారంభమై భారీ వర్షం కురిసింది. రోడ్లపై వర్షం నీరు కాలువలను తలపిస్తూ ప్రవహించింది. పలుచోట్ల రోడ్లపై నీరు చేరడంతో వాహనచోదకులు ఇబ్బందుతు పడ్డారు. వరినాట్లకు ఈ వర్షం నీరు మేలు చేయనుంది. రెండు రోజులుగా వర్షం పడుతుండడంతో వరిపైరుపై చీడపీడలు తగ్గే అవకాశాలున్నాయని రైతులు తెలిపారు.

ప్రజారంజక పాలన జగనన్నతోనే సాధ్యం

- ఎంపీ డాక్టర్ సత్యవతి
- పలు రహదారులకు ప్రారంభోత్సవం



నాగవరంలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎంపీ డాక్టర్ సత్యవతి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ

మునగపాక : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సువర్ణయుగంగా నడుస్తుందని అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి అన్నారు. ప్రజారంజక పాలన జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక వైపు సంక్షేమం మరో వైపు అభివృద్ధి శరవేగంగా జరుగుతుందన్నారు. ఎంపీ ల్యాండ్స్ ద్వారా మంజూరైన నిధులతో నాగవరం, గణపర్తి గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లను ఆమె మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తూ దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా పేరుగాంచారన్నారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రజలకు సకాలంలో సేవలందుతున్నాయన్నారు. అభివృద్ధి పనులతో గ్రామాలు సస్యశ్యామలంగా మారుతున్నాయన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే రమణమూర్తిరాజు సహకారంతో నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. మాజీ ఎంపీపీ దాసరి గౌరీలక్ష్మి అప్పారావు, సర్పంచ్‌లు రమణమ్మ, చదరం నాయుడు, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ బోజా లక్ష్మి శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు, మల్లవరం సర్పంచ్ ఇందల హేమలత నాయుడు, నాగవరం వైస్ ప్రెసిడెంట్ నాయుడు, పాలసంఘ అధ్యక్షుడు గనిరెడ్డి వెంకట్, వార్డు సభ్యులు ఆదిలక్ష్మి, కోటేశ్వరరావు, అప్పికొండ శ్రీనివాసరావు డాక్టర్ విష్ణుమూర్తి ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నాగవరంలో మొక్కలను ఎంపీ డాక్టర్ సత్యవతి అందజేశారు.

రజకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



మాట్లాడుతున్న రజక సంఘాల రాష్ట్ర ఐక్యవేదిక కన్వీనర్ అంజిబాబు

మునగపాక (అచ్యుతాపురం): రజకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని రజక సంఘాల రాష్ట్ర ఐక్యవేదిక కన్వీనర్ పాతపాటి అంజిబాబు కోరారు. రజకుల హక్కులతో పాటు నిరుద్యోగ సమస్య పరిష్కరించేలా చూడాలని కోరారు. అచ్యుతాపురం మండలం హరిపాలెం గ్రామంలో మంగళవారం శ్రీ సూర్యరజక ఆత్మీయ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడారు. ఈ నెల 26న విజయవాడ-గుంటూరు మధ్య జరిగే ఆత్మగౌరవ మహాసభలో రజకుల సమస్యలపై చర్చ జరుగుతుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన రజకులకు అందించాలన్నారు. కార్పొరేషన్ డైరెక్టర్ ఈగలపాటి యువశ్రీ, ఏపీ స్పోర్ట్స్ డైరెక్టర్ జొన్నాడ శ్రీనివాసరావు, అనకాపల్లి జిల్లా రజక సంఘ అధ్యక్షుడు చల్లపల్లి రామకోటేశ్వరరావు, అనకాపల్లి మండల రజక సంఘ అధ్యక్షుడు పొట్నూరి తిరుపతయ్య, జిల్లా కోశాధికారి తురంగల సన్యాసిరావు, మాజీ సర్పంచ్ కాండ్రేగుల సూర్యనారాయణ, శరగడం ప్రసాద్, సాంబశివ, జోగినాయుడు సమావేశంలో పాల్గొన్నారు.

సామాజిక సాధికార బస్సు యాత్రకు తరలి రావాలి



మాట్లాడుతున్న ఒంపోలు సచివాలయ కన్వీనర్ సూర్యనారాయణ

మునగపాక : ఈ నెల 9న అనకాపల్లిలో జరగనున్న సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలని ఒంపోలు సచివాలయ కన్వీనర్ నరాలశెట్టి సూర్యనారాయణ కోరారు. మునగపాకలోని బొడ్డేడ క్యాంపు కార్యాలయంలో మంగళవారం మండలస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డితో పాటు పలువురు మంత్రులు ఈ యాత్రలో పాల్గొంటారన్నారు. బస్సుయాత్రలో భాగంగా మునగపాక, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల నుంచి పెద్ద ఎత్తున బైక్‌ర్యాలీ నిర్వహించి ఘన స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు తరలిరావాలన్నారు. సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ దొడ్డి వరహా సత్యనారాయణ, సర్పంచ్‌లు దిమ్మల అప్పారావు, నూకరాజు, గంగప్పలనాయుడు, బొడ్డేడ శ్రీనివాసరావు, పెదబ్బాయి, ఎంపీటీసీలు వీరునాయుడు, నాగేశ్వరరావు, నాగేశ్వరరావు,పార్టీ నేతలు దుబాసినాయుడు,రవీంద్రరాజు, రామజోగినాయుడు, ధనశ్రీను పాల్గొన్నారు.

9 నుంచి గ్రామాల్లో సంక్షేమ పథకాలపై అవగాహన

యలమంచిలి : మండలంలో 10 గ్రామ సచివాలయాల్లో ఈ నెల 9వ తేదీ నుంచి 23వ తేదీ వరకు సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో అప్పలనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, వాటి వివరాలు లబ్ధిదారులకు తెలియజేయడానికి గ్రామ సభలు నిర్వహించి పథకాల వివరాలు డిస్‌ప్లే బోర్డుల ద్వారా ప్రదర్శించి ప్రజల సందేహాలు నివృత్తి చేయడం జరుగుతుందని తెలిపారు.

పంచాయతీరాజ్ విస్తరణాధికారి (నోడల్ అధికారి) ఆధ్వర్యంలో యలమంచిలి మండలంలో 10 సచివాలయాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని ప్రజాప్రతినిధులు ప్రజలు గ్రామ పంచాయతీ అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

కార్మిక నేత రమేష్ సేవలు చిరస్మరణీయం



కార్మిక నేత రమేష్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



దిమిలిలో రమేష్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దేముడునాయుడు, ఆశ కార్యకర్తలు

మునగపాక (అచ్యుతాపురం): కార్మికుల సంక్షేమం కోసం అలుపెరుగని పోరాటం చేసిన రమేష్ అందరికీ ఆదర్శంగా నిలుస్తారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము అన్నారు. మంగళవారం కార్మిక నేత రమేష్ వర్ధంతి సందర్భంగా హరిపాలెం, అచ్యుతాపురం తదితర ప్రాంతాల్లో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి రమేష్ ఎనలేని సేవలందించారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. సీఐటీయూ మండల కన్వీనర్ సోమునాయుడు, జి.సత్తిబాబు, సింహాద్రి, ఐద్వా నాయకులు ఆర్.లక్ష్మి సరోజిని, మంగమ్మ, సూరిలక్ష్మి, విజయ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాంబిల్లి : కార్మికనేత ఎస్.రమేష్ 6వ వర్ధంతి సందర్భంగా దిమిలిలో మంగళవారం సీఐటీయూ మండల కార్యదర్శి దేముడునాయుడు, ఆశ కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేముడునాయుడు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పోరాటబాట పట్టి విద్యార్థుల సమస్యల పరిష్కారానికి రమేష్ కృషి చేశారని, అదే విధంగా కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు.

శ్మశాన వాటికలో షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన



పాములవాకలోని శ్మశాన వాటికలో షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ సత్యవతి

కోటవురట్ల : పాములవాక ఎస్సీ కాలనీ స్మశాన వాటికలో షెడ్ నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్ డి.సత్యవతి కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్సీ కాలనీ శ్మశాన వాటికలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రధానంగా షెడ్ లేకపోవడంతో ముందుగా షెడ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో మాణిక్యాలరావు, వలంటీర్లు ఆనంద్, దాసు, రాధ పాల్గొన్నారు.

సూపర్‌ఫాస్ట్ రైళ్లకు హాల్ట్ కల్పించాలి

తుమ్మపాల: అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌలభ్యం కోసం అన్ని సూపర్ ఫాస్ట్ రైళ్లకు హాల్ట్ కల్పించాలని డిమాండ్ చేస్తూ సిద్ధార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు రైల్వే స్టేషన్ వద్ద ప్లకార్డులతో మంగళవారం నిరసన తెలిపారు. అనంతరం ఎంపీ బీవీ సత్యవతికి సంస్థ అధ్యక్షుడు బల్లా నాగభూషణం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన జిల్లాగా ఏర్పడ్డాక జిల్లావాసులకు అనకాపల్లి రైల్వే స్టేషన్ ప్రధాన కేంద్రంగా మారిందన్నారు. విశాఖ తర్వాత రైల్వే శాఖకు ఎక్కువ ఆదాయం అనకాపల్లి కేంద్రంగా వస్తుందన్నారు. ఇక్కడ అన్ని రైళ్లకు హాల్ట్ ఏర్పాటయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ కార్యవర్గ సభ్యులు పట్నాల కృష్ణమోహన్, కె.రామారావు, జిల్లా బుద్ధిస్ట్ సొసైటీ అధ్యక్షుడు నేలపూడి బాలరాజు, పొట్టి శ్రీరాములు, సంస్థ చైర్మన్ పిరాట్ల నరసింహమూర్తి పాల్గొన్నారు.

దురలవాట్లతో క్యాన్సర్ ముప్పు



క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : అనారోగ్య కారక ఆహార అలవాట్లు వల్లే క్యాన్సర్ వ్యాధి సోకుతోందని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి శక్తిప్రియ అన్నారు. జాతీయ క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకుని సర్వసిద్ధి గ్రామంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ స్త్రీలు పిల్లలకు రొమ్ముపాలు అందించాలని తద్వారా రొమ్ము క్యాన్సర్ బారిన పడకుండా ఉండవచ్చన్నారు. పొగాకు ఉత్పత్తులు వాడకం వల్ల నోటి క్యాన్సర్, ఊపిరితిత్తులు, గర్భసంచి క్యాన్సర్‌లు వస్తాయన్నారు. అందువల్ల వాటికి దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎస్.ఎస్.వి.ప్రకాష్, హెల్త్ విజిటర్ పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేడు మునగపాకలో 'జగనన్నకు చెబుదాం'

మునగపాక : మునగపాకలోని రాహుల్‌గాంధీ కళ్యాణమండపంలో బుధవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరుగుతుందని ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జరిగే కార్యక్రమంలో ఇళ్ల స్థలాలు, అలాగే పలు రకాల సర్టిఫికెట్ల కోసం అర్జీలు స్వీకరిస్తారన్నారు. జిల్లా కలెక్టర్ రవి పటాన్‌శెట్టితో పాటు జిల్లాస్థాయి అధికారులు హాజరయ్యే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వినయ్‌కుమార్ కోరారు.

సచివాలయాల్లో సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమాలు

ఎస్.రాయవరం : ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరాల డిస్‌ప్లే బోర్డులు, ఆవిష్కరణ కార్యక్రమాలు సచివాలయాల వారీగా నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో రామచంద్రమూర్తి మంగళవారం తెలిపారు. ముందుగా దార్లపూడి-1 సచివాలయంలో 9వ తేదీన, 10న దార్లపూడి-2, 14న చినగుమ్ములూరు, 15న పెదగుమ్ములూరు, 16న తిమ్మాపురం, 17న తిమ్మాపురం-2 , 20న కొరుప్రోలు, 21న గుడివాడ, 22న గుర్రాజుపేట, 23న కొత్త రేవుపోలవరంలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సచివాలయాల్లో ప్రభుత్వ పథకాల వివరాలు చెబుతూ వాటి ప్రయోజనాలు వివరించాలని చెప్పారు.

హక్కులపై అవగాహన పెంచుకోవాలి

డీఎస్ఎన్ఎల్ యూ ప్రొఫెసర్ విజయలక్ష్మి

సబ్బవరం: మహిళలు, బాలికలు తమ హక్కులు, వాటికి సంబంధించిన చట్టాలపై అవగాహన పెంచుకోవాలని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(డీఎస్ఎన్ఎల్‌యూ) ప్రొఫెసర్ ఎస్.విజయలక్ష్మి సూచించారు. మోహాద్రి గెడ్డలోని గురుకుల పాఠశాలలో మంగళవారం డీఎస్ఎన్ఎల్యూలోని సెంటర్ ఫర్ ఉమెన్ అండ్ చైల్డ్ లా ఆధ్వర్యంలో మహిళలు, బాలికల హక్కులు, చట్టాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఫ్యాకల్టీ చైర్ పర్సన్ ప్రొఫెసర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నేడు మహిళలు అనేక రకాల హింసలకు గురవుతున్నారన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు తెలుసుకోలేక చేస్తున్న పనులతో చిన్నారులు బాల్యాన్ని కోల్పోవడమే కాక అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. బాల్య వివాహాల నిరోధక చట్టం 2006 రూపొందించి చిన్నారుల భవిష్యత్తును కాపాడే దిశగా అడుగులు వేయడం జరుగుతుందన్నారు.

మిలట్రీ కాలనీలో యువకుడి కలకలం



పట్టణంలోని మిలట్రీ కాలనీలో స్థానికులు పట్టుకున్న యువకుడు

యలమంచిలి (అనకాపల్లి రూరల్): పట్టణంలోని మిలట్రీ కాలనీలో మంగళవారం రాత్రి ఓ యువకుడు కొన్ని ఇళ్లలోకి చొరబడి కలకలం సృష్టించాడు. రాత్రి 8 గంటల సమయంలో రాంనగర్ రైల్వేగేటుకు సమీపంలో ఉన్న ఒక ఇంట్లోకి చొరబడిన 20 ఏళ్ల యువకుడ్ని స్థానికులు పట్టుకోవడానికి యత్నించగా తప్పించుకుపోయాడు. ఆ తర్వాత ట్యూషన్‌కు వెళ్లి వస్తున్న ఇద్దరు బాలికల్లో ఒకరి చేయి పట్టుకుని లాక్కుపోవడానికి ప్రయత్నించిన ఆ యువకుడ్ని స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. హిందీలో మాట్లాడుతున్న అతడి వద్ద లభించిన ఆధార్ కార్డులో జార్ఖండ్ రాష్ట్రానికి సంబంధించిన అడ్రస్ ఉంది. స్థానికులు పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణంలో ఇటీవల మందుబాబుల ఆగడాలతో ఇబ్బందులు పడుతున్న పట్టణవాసులకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి హల్‌చల్ చేస్తున్న అపరిచిత వ్యక్తులు హడలెత్తిస్తున్నారు. ఈ విషయంపై మిలట్రీ కాలనీవాసులు పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు.

కెనాల్ గేట్లకు తాత్కాలిక మరమ్మతులు



భీమవరపుకోట కెనాల్ వద్ద గేట్‌ను మూసేస్తున్న రైతులు

కోటవురట్ల: తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో పంటలు ఎండిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధానంగా వరి చేలు చాలా వరకు ఎండిపోతున్నాయి. అయితే ప్రతి సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో అత్యవసర సమయంలో తాండవ కాలువే రైతులను ఆదుకుంటుంది. కానీ తాండవ ప్రాజెక్టు నుంచి సాగునీటిని వదిలినా పాములవాకను దాటి వచ్చే పరిస్థితి లేదు. కాలువలో పూడిక తీయకపోవడం, గేట్లకు మరమ్మతు చేయించకపోవడం తదితర కారణాలతో తాండవ కాలువ నుంచి కూడా నీరు అందని పరిస్థితి ఎదురైంది. గేట్లు శిథిలం కావడంతో సాగునీరు భీమవరపుకోట గేటు నుంచి కింది ప్రాంతాలకు పోతోంది. పాములవాక పరిధిలోని నీలిగుంట వరకు ఉన్న వరి చేలకు నీరు అందక ఎండిపోతున్నాయి. అధికారులు స్పందించకపోవడంతో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు చొరవ చూపారు. రైతులే శ్రమదానం చేసి గేట్లకు తాత్కాలికంగా మరమ్మతు చేసి నీరు మళ్లించాలని నిర్ణయించారు. మంగళవారం పలువురు రైతులు ముందుకొచ్చి భీమవరపుకోట వద్ద తాండవ కాలువలో గేట్‌కు మరమ్మతు చేసి మూసివేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ గురువారం మధ్యాహ్నం 12 గంటల వరకు గేట్ మూసి ఉంటుందని, అందువల్ల పాములవాక పరిధిలోని రైతులు సాగునీటిని వినియోగించుకోవాలని సూచించారు.

శరవేగంగా విజయదుర్గ అమ్మవారి ఆలయ నిర్మాణం



హరిపాలెంలో నిర్మితమవుతున్న అమ్మవారి ఆలయం



ఆలయానికి వెళ్లేమార్గంలో ప్రభుత్వం నిర్మించిన రహదారి

మునగపాక(అచ్యుతాపురం): చుట్టూ ఆహ్లాదకర వాతావరణంతో కొండపై అమ్మవారి ఆలయం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటున్నది. మండలంలోని హరిపాలెంలో భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి విజయదుర్గ అమ్మవారి ఆలయ నిర్మాణం శరవేగంగా జరుగుతుంది. గ్రామస్తుల విరాళాలతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన భక్తుల ఆర్థిక సహకారంతో ఆలయం నిర్మాణం జరుగుతోంది. హరిపాలెం కొండపై 1.78 ఎకరాల మేర రైతుల నుంచి స్థలం సేకరించి ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు శ్రీకారం చుట్టారు. సుమారు కోటి రూపాయల వ్యయంతో ఆలయం నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. ఇప్పటికే ఆలయ నిర్మాణ పనులు ఒక దశకు చేరుకున్నాయి. అమ్మవారి విగ్రహం, గ్రిల్స్ ఇతర విగ్రహాలను దాతలు అందజేశారు. ఆలయానికి వెళ్లే మార్గంలో ప్రభుత్వం రూ.8 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించింది. పంచాయతీ ద్వారా విద్యుత్ సదుపాయం, మండల పరిషత్ నిధుల నుంచి తాగునీటి బోరు సదుపాయం కల్పించారు. ధ్వజస్తంభం ఏర్పాటుకు ఇప్పటికే 560 కిలోల మేర ఇత్తడిని భక్తులు ఆలయ కమిటీకి అందజేశారు. అన్ని పనులు పూర్తి చేసి ఫిబ్రవరిలో ఆలయ ప్రారంభోత్సవం చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్న కమిటీ సభ్యులు తెలిపారు.

సీఎం చిత్రపటానికి పాత్రికేయుల క్షీరాభిషేకం



మునగపాకలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జర్నలిస్టులు

మునగపాక : ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జర్నలిస్టుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని మాజీ వైస్ ఎంపీపీ దొడ్డి వరహా సత్యనారాయణ అన్నారు. జర్నలిస్టులకు ఇంటి స్థలాల మంజూరుకు ఇటీవల కేబినెట్‌లో ఆమోదం తెలపడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం మునగపాకలో జర్నలిస్టుల ఫోరం ఆధ్వర్యంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పార్టీ నేతలతో కలిసి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వరహా సత్యనారాయణ మాట్లాడుతూ గతంలో ఎవరూ చేయలేని విధంగా పాత్రికేయులకు 3 సెంట్ల మేర స్థలం ఇచ్చేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. పాత్రికేయ కుటుంబాల్లో వెలుగులు నింపిన జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోలేనిదన్నారు. ప్రజలకు,ప్రభుత్వానికి మధ్య వారధుల్లా పనిచేసే పాత్రికేయుల సేవలను గుర్తించిన జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ కృతజ్ఞతలు తెలపాలన్నారు. పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులతో పాటు జర్నలిస్టు ఫోరం సభ్యుడు కర్రి భాస్కరరావు, సత్యనారాయణ, కుమార్,వాసు, బుజ్జి పాల్గొన్నారు.

తెలుగు భాషపై పట్టు సాధించాలి



మాట్లాడుతున్న ప్రముఖ పద్యకవి తమ్మిరాజు

మునగపాక : ప్రతి ఒక్కరూ తెలుగు భాష నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ప్రముఖ పద్యకవి శిష్టా తమ్మిరాజు కోరారు. మునగపాకలోని ప్రియదర్శిని పబ్లిక్ స్కూల్లో మంగళవారం తెలుగుకు వెలుగునిద్దాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా ఉండే గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటూ తెలుగుపై పట్టు సాధించాలన్నారు.

తెలుగు భాష పరిరక్షణ సమితి సమన్వయకర్త కె.రామ్మోహనరావు మాట్లాడుతూ పాఠశాలల్లో నిర్వహించే తెలుగుపోటీలు, జిల్లాస్థాయిలో నిర్వహించే రామాయణం పోటీలకు హాజరుకావాలన్నారు. ప్రముఖ రచయిత్రి మల్లేశ్వరి మాట్లాడుతూ తెలుగులో ప్రావీణ్యం పెంచుకోవాలన్నారు. తాను రాసిన కవితలను చదివి వినిపించారు. ప్రియదర్శిని స్కూల్ కరస్పాండెంట్ వేగి వీరునాయుడు, రోటరీ అధ్యక్షుడు పి.జె. నాయుడు, ఉపాధ్యాయులు దాడి శివ జగ్గారావు, రవిబాబు, శ్రీనివాసరావు, మణి, భారతి, కమల, ప్రగతి స్కూల్ ప్రిన్సిపాల్ వేగి శ్రీను, వైస్ ప్రిన్సిపాల్ మాడెం జోగారావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పైపులైను పనులు పరిశీలించిన ఆర్‌డీవో

నక్కపల్లి : హెటిరో రసాయన పరిశ్రమ వారు సముద్రంలోకి ఏర్పాటు చేస్తున్న పైపులైను పనులను నర్సీపట్నం ఆర్‌డీవో జయరాం మంగళవారం పరిశీలించారు. రాజయ్యపేట, దొండవాక తీరం నుంచి పైపులైను ఏర్పాటు చేస్తున్నారు. ఈపైపులైను ప్రభుత్వ భూముల్లో నుంచి వేస్తున్నారా? అనే విషయాన్ని పరిశీలించారు. ప్రభుత్వ, అటవీభూముల్లో పైపులైను వేస్తున్నారంటూ ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఆర్‌డీవో ఈ భూములు పరిశీలించారు. రికార్డులు పరిశీలించిన తర్వాత పైపులైను పూర్తిగా కంపెనీకి చెందిన జిరాయతీ భూముల్లోనే ఏర్పాటు చేస్తున్నారని నిర్ధారించారు. మరోసారి పైపులైను పనులు పరిశీలిస్తామని, ఈలోగా స్కెచ్ ఇవ్వాలని అడిగారు. ఈయన వెంట తహసీల్దార్ అంబేద్కర్, కంపెనీ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, డీజీఎంలు సుబ్బారెడ్డి, కుళ్లాయి రెడ్డి పాల్గొన్నారు.

పాము కాటుతో మహిళ మృతి



పాయకరావుపేట : మండలంలో గల నామవరం గ్రామానికి చెందిన చందక సూర్యకాంతం (58) అనే మహిళ సోమవారం పాము కాటుకు గురై మృతి చెందడం జరిగిందని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఉదయం సూర్యకాంతం పొలంలోనికి వెళ్లి పని చేస్తుండగా గుర్తు తెలియని విషసర్పం కాలిపై కుట్టడంతో నొప్పితో బాధపడుతూ ఆమె ఇంటికి వచ్చేసింది. ఇంటికి వచ్చిన వెంటనే తన నోటి నుంచి నురగ రావడంతో కింద పడిపోయింది. ఆమెను తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మరణించింది. మృతురాలి కుమారుడు భాస్కరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.